# జాతీయ నగదీకరణ పైప్‌లైన్ (ఎన్‌ఎంపి)తో ప్రైవేటీకరణ వేగవంతం, తీవ్రతరం

**"మేము** సంస్కరణలకు కట్టుబడి వున్నాం. జాతీయ ప్రయోజనాల కోసం మేము ఎలాంటి విపత్కర పరిస్థితుల నెదుర్కోవడానికైనా సిద్ధంగా వున్నాం. కరోనా మహమ్మారి తీవ్రంగా వున్న సమయంలోనూ మేము (ఆర్థిక) సంస్కరణలను కొనసాగించా"మని సెప్టెంబర్‌లో జరిగిన ఓ సమావేశంలో ప్రధాని మోడీ వివరించాడు. ప్రభుత్వ బాధ్యత వ్యాపారం చేయటం కాదని మోడీ సెలవిచ్చాడు. ప్రభుత్వం పాలించటం కోసం ఉందన్నాడు. తన ప్రజావ్యతిరేక విధానాల నుండి తన మాయ మాటలతో ప్రజలను ప్రక్కదోవ పట్టిస్తున్నాడు. ఈ విధానాలతో రాజ్యాంగంలో రాసుకున్న సంక్షేమ రాజ్య సూత్రాలు సైతం పూర్తిగా తొలగిపోతున్నాయి.

జాతీయ నగదీకరణ పైప్‌లైన్ పేరున "అమ్మకం లేదా అద్దెకు వనరులు" లభిస్తాయని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పేరులోనే నిరంతరం వనరులను 'పైప్‌లైన్'లో తరలిస్తామని హామీ ఇస్తున్నారు. ఈ అద్దెకిచ్చే కాలం 20 లేదా 30 సం॥లు వుండవచ్చు. ఇది ప్రైవేటీకరణ మినహా వేరుకాదు. ఈ నిర్ణయం పట్ల బడా కార్పొరేట్లు, సామ్రాజ్యవాద దేశాల సంస్థలు హర్షం వ్యక్తం చేశాయి. ఇప్పటికే ప్రజానీకం పాలకుల పెద్దనోట్ల రద్దుతో మోసపోయారు.

రోడ్లు, ఎలక్ట్రానిక్స్, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, ఆప్టికల్ ఫైబర్, రైల్వే లైన్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా ప్రాంగణాలు, పెట్రోలియం సరఫరా సంస్థలు మొదలైన మొత్తం 15 విభాగాలకు చెందిన సంస్థలను కేంద్ర ప్రభుత్వం అద్దెకు ఇచ్చేవిగా గుర్తించింది. కేంద్ర ప్రభుత్వం ఈ ఎన్‌ఎమ్‌పిని గ్రామ పంచాయితీలలో అమలుచేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. తీవ్రతరమైన ప్రైవేటీకరణ దుష్ఫలితాలు, దేశ ప్రజానీకపు జీవితాలను మరింతగా దిగజారుస్తాయి.

మౌలిక వసతులు కల్పించేందుకుగాను పై విభాగాలకు చెందిన సంస్థలను తాము కేవలం అద్దెకు మాత్రమే ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. ఎన్‌ఎమ్‌పి ద్వారా రాగల నాలుగేండ్లలో 6.5 లక్షల కోట్ల నిధులు సమకూర్చుకోవాలని, ఆర్థిక అగ్రరాజ్యాల జాబితాలో మన దేశాన్ని నిలపాలని ప్రభుత్వం చెబుతోంది. ఈ విధమైన భ్రమలతో దేశ ప్రజలను పాలకులు మోసగిస్తున్నారు.

"ఈ బృహత్తర పథకంలో అమ్మకమో లేదా అద్దెకివ్వటమో జరుగుతుంది. అయినా అనేక సందేహాలు, భయాలు తలెత్తుతున్నాయి. అనూహ్య స్థాయిలో ధరల పెరుగుదల, ప్రజాసంక్షేమంలో కోత మొదటి అంశం. పాలకుల అనుయాయులకు లబ్ధి చేకూర్చేందుకు జాతీయ సంపద యొక్క ధరలను తక్కువ చేసి చూపటం రెండవ అంశం. ఎన్‌ఎంపిలో లెక్కలేనన్ని క్విడ్ ప్రోకో (నీకిది – నాకిది)లకు అవకాశముంది. ఇది ఓ భారీ కుంభకోణం గాకుండా దీనిని నిరోధించే పద్ధతి లేకుంటే, అది దేశాన్ని మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుంది" అని మాజీ కేంద్ర సమాచారశాఖ కమీషనర్ మాడభూషి శ్రీధర్ పేర్కొన్నారు. ఈ ఎన్‌ఎంపి ద్వారా జాతీయ భద్రతా సమస్యలు కూడా తలెత్తుతాయని ఆయన పేర్కొన్నాడు. ప్రసార మాధ్యమాలలో జరిగిన చర్చలలో "ఈ నగదీకరణ పథకం ప్రకటించేముందు ప్రభుత్వం ఆస్ట్రేలియా అనుభవాలను పరిశీలించిందా" అని కొందరు ప్రశ్నించారు. ప్రభుత్వం వివరణ ఇస్తూ "బడ్జెట్‌లో పేర్కొన్నవిధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ సంస్థల ద్వారా 1.75 లక్షల కోట్ల రూపాయల నిధులతో ఆగిపోలేమని" చెప్పారు. దీపం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్‌వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అస్సెట్ మేనేజిమెంట్) సంస్థ ప్రకటించిన ప్రైవేటీకరించే సంస్థల జాబితాలో ఎయిర్ ఇండియా, బిపిసిఎల్, షిప్పింగ్ కార్పొరేషన్, పవన్‌హంస్, నీలాంచల్ ఇస్పాత్‌లున్నాయి.

ఎల్‌ఐసి అత్యధిక లాభాలార్జించే కార్పొరేషన్. ఆచరణలో నష్టాలు, నిరర్థక ఆస్తులుగా ప్రకటించాల్సిన అవసరంలేదు. ఎల్‌ఐసిలో 10 శాతం వాటాలను అమ్మితే, ప్రభుత్వ ఖజానాకు లక్ష కోట్ల రూ॥ పైగా సమకూరుతాయి. తర్వాత ప్రజలకు షేర్లు విడుదల చేయటం ద్వారా 10 లక్షల కోట్ల రూ॥ జమ అవుతాయి. అందుకే ఎల్‌ఐసిని నగదీకరించటానికి ప్రభుత్వం అత్యంత ఆసక్తి కనబరుస్తోంది. ఈ విధంగా ప్రజాసంపదను పాలకవర్గాలు దోపిడీ చేస్తున్నాయి.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ క్రమాన్ని ప్రారంభించటానికి ప్రభుత్వం 'దీపం'కు అనుమతిచ్చింది. ఆంధ్రరాష్ట్ర ప్రజానీకం దీనిని సాధించుకోవటానికి ఎన్నో త్యాగాలు చేశారు. గత నెలలోనే ఎయిర్ ఇండియా అమ్మకం ప్రక్రియ ప్రారంభమైంది. తిరుపతి, భువనేశ్వర్, వారణాసి, అమృత్‌సర్, తిరుచ్చి, ఇండోర్, రాయపూర్, కుషినగర్, కాంగ్రా మొదలైన 13 విమానాశ్రయాల యాజమాన్యాలను ప్రైవేటురంగానికి ఎన్‌ఎంపి ద్వారా బదలాయించనున్నారు.

మహారత్న కంపెనీగా కొనియాడబడిన భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) మెరుగైన లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ కూడా, ప్రభుత్వం దీనిని అమ్మివేస్తున్నది.

పైన పేర్కొన్న ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరించటమో లేదా కార్పొరేటీకరించటమో జరిగితే మనదేశ సార్వభౌమత్వమనేది పెద్ద ప్రమాదంలో పడుతుంది.

"విదేశీ పెట్టుబడి మౌలికంగా జాతీయ వ్యతిరేకంగా తప్ప మరోలా వుండదు. అది జాతీయ పెట్టుబడిని అణచివేసి, దాని స్థానంలో తిష్ట వేసుకు కూర్చుంటుంది. వెనుకబడిన దేశాల జాతీయ పెట్టుబడిని బలవర్ధకం చేయడానికి కాక, దానిని ముంచెత్తి అణచివేయడానికే ఆ దేశాలలోకి విదేశీ పెట్టుబడి ప్రవేశిస్తుందని, దానికి సహాయం చేయడానికి కాక, దానిని నాశనం చేసి తానే యజమాని కావడానికేనని అన్ని దేశాల చరిత్ర చాటింది.... మన దేశాన్ని బలమైన, శక్తివంతమైన, ఆరోగ్యకరమైన స్వతంత్ర దేశంగా పునర్నిర్మించాలంటే విదేశీ పెట్టుబడిని పూర్తిగా స్వాధీనం చేసుకోవటం మినహా మరోమార్గం లేనేలేదని" కా॥ తరిమెల నాగిరెడ్డి తాకట్టులో భారతదేశంలో విస్పష్టంగా పేర్కొన్నారు.

ఐదు దశాబ్దాల క్రితం విప్లవ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి ఆనాటి దేశ ఆర్థిక పరిస్థితులపై ఆధారపడి భారతదేశం తాకట్టులో వుందని ప్రకటించినందుకు ఆయనను తీవ్రవాది అన్నారు. అయితే ప్రస్తుతం సామ్రాజ్య వాదులకు, దళారీ పెట్టుబడిదార్లకు దేశ సంపదనంతా కట్టబెడ్తున్న మన దేశ పాలకులను ఏ పేరుతో పిలవాలో కార్మికవర్గం ఆలోచించాలి. కేంద్ర ప్రభుత్వాధినేతలు ప్రజాధనాన్ని ధారాళంగా ఖర్చుపెట్టి ఛార్టెడ్ విమానాలలో ప్రపంచ దేశాలన్నీ తిరిగి మన దేశంలో పెట్టుబడులు పెట్టమని అర్థించినా, ఎవరూ ముందుకు రావటంలేదు. అందువలనే ప్రభుత్వరంగంలోని పరిశ్రమలను, కంపెనీలను చౌకగా తెగనమ్మటానికి కేంద్రం పూనుకుంది.

పోర్టులు, పరిశ్రమలు, రోడ్లు, విమానాశ్రయాలు, రైల్వేలు మొదలైన ప్రజాధనంతో నిర్మించినవాటిని అమ్మటానికో లేదా అద్దెకివ్వటానికో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదు. ప్రజలు పాలకులకు ఓటు వేసింది తమను పరిపాలించటానికి మాత్రమే. కానీ పాలకులు, తమ విచక్షణానుసారం ప్రజల ఆస్తులు అమ్మటానికి ప్రజలు తమకు అధికారం కట్టబెట్టారని భావిస్తున్నారు. పాలకుల ఈ చర్యలను తిప్పికొట్టాలి.

భారత స్వాతంత్ర్యోద్యమం నుండి ప్రజానీకం స్ఫూర్తిని స్వీకరించి, ప్రభుత్వ సంస్థలను, దేశ సంపదలను సామ్రాజ్యవాద, బడా, బహుళజాతి కార్పొరేట్లకప్పగించే ఈ కుట్రలను వమ్ముచేయాలి.

★★★★★